ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



బాపట్ల జిల్లా వార్తలు

7

గురువారం 16 అక్టోబరు 2025

మంగళగిరి బెటాలియన్‌లో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం

హాజరు కానున్న సీఎం, హోంమంత్రి.. ● భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

ఉపాధ్యాయుడి సస్పెన్షన్ 8లో..

ప్లాస్టిక్ ప్రతి మనిషి జీవితంలో ఒక భాగమైంది. ఉదయం నిద్ర లేవగానే పాల ప్యాకెట్లతో మొదలయ్యే ప్లాస్టిక్ వినియోగం కూరలు, పళ్లు, టిఫిన్ ఇతర వస్తువులు ఏవి కొన్నా, ప్లాస్టిక్ కవర్లనే ప్రజలు వినియోగిస్తున్నారు. ఒకసారి వాడిపడేసే ప్లాస్టిక్‌తో పర్యావరణంతో పాటు ఆరోగ్యానికి హానికరం అని తెలిసినా దానికి దూరంగా ఉండలేకపోతున్నారు. ప్లాస్టిక్‌ను తయారు చేసే, వినియోగించే వారిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చూసీ చూడకుండా వ్యవహరిస్తుండటంతో జిల్లాలో ప్లాస్టిక్ వాడకం యథేచ్ఛగా జరుగుతోంది.



నిషేధమా అదెక్కడ?

- జిల్లాలో ఎక్కడా అమలు కాని ప్లాస్టిక్ నిషేధం
- విచ్చలవిడిగా నిషేధిత ప్లాస్టిక్ సామగ్రి విక్రయాలు
- తనిఖీలు మరచిన అధికారులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది. ప్లాస్టిక్‌ను నిరోధించాలని అధికారులను ఆదేశిస్తోంది. డిసెంబరు నాటికి ప్లాస్టిక్ రహిత ఆంధ్రప్రదేశ్ రూపొందించాలని ప్రభుత్వం సంకల్పించింది. దీని కోసం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తోంది. అయితే ప్రభుత్వ లక్ష్యాలకు, ప్రజలు సంబంధిత అధికారులు తూట్లు పొడిచేలా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. జిల్లాలోని పట్టణాలతో పాటు పల్లెల్లోనూ విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం జరుగుతోంది. ఉదయం పాల ప్యాకెట్ నుంచి ప్లాస్టిక్ వినియోగం ప్రారంభమవుతోంది. ప్రజలు నిషేధిత ప్లాస్టిక్ కవర్లను నిత్యం వేల సంఖ్యలో వినియోగిస్తున్నారు. వ్యాపారులు యథేచ్ఛగా నిషేధిత ప్లాస్టిక్ కవర్లను విక్రయిస్తున్నారు. కూరగాయలు, సరుకులు, పళ్లు ఇలా ఏమి కొనుగోలు చేసినా ప్లాస్టిక్ సంచుల్లోనే ఇస్తున్నారు.

● తనిఖీలను మరిచిన అధికారులు

ప్లాస్టిక్ వినియోగంపై మునిసిపాలిటీలు, పంచాయతీలు, సచివాలయాల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. మునిసిపల్ అధికారులయితే తనిఖీలను పూర్తిగా మరిచారు. తిరిగి వాడుకునేందుకు పనికిరాని.. ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్‌తో తయారు చేసిన పాలథిన్ కవర్లు, సీసాలు, గ్లాసులు ఇలా 18 రకాల ప్లాస్టిక్ వస్తువులపై కేంద్రప్రభుత్వం నిషేధం విధించింది. నిషేధిత ప్లాస్టిక్ జాబితాలో 75 మైక్రాన్ల లోపు మందం ఉన్న క్యారీ బ్యాగులతో పాటు 50 మైక్రాన్లలోపు మందం ఉన్న ప్లాస్టిక్ షీట్లు, పాన్ మసాలా ప్యాకెట్లతో పాటు మరో 18 రకాల ప్లాస్టిక్ ఉత్పత్తులను చేర్చారు. ఒక్కసారి మాత్రమే వినియోగించే ప్లాస్టిక్ గ్లాసులు, కప్పులు, స్పూన్లు, స్ట్రాలు తదితరాలన్నీ నిషేధిత జాబితాలో ఉన్నాయి. నిషేధాన్ని క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగం అమలు చేయాల్సి ఉంది. అయితే జిల్లా వ్యాప్తంగా నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తులను అరికట్టడంతో యంత్రాంగం (మిగతా 8వ పేజీలో)



ప్లాస్టిక్ కవర్లలో కూరల ప్యాకింగ్

● కఠినమైన చట్టాలున్నా అమలేది..!

కఠినమైన చట్టాలు ఉన్నా వీటిని అమలు చేసి నిషేధిత ప్లాస్టిక్‌ను అరికట్టాల్సిన అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోంది. ప్లాస్టిక్ నిషేధిత చట్టాలను అమలు చేయటంలో అధికారులు వెనకడుగు వేస్తుండటం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది. అధికారులు చర్యలు తీసుకోవటం మాట ఎలా ఉన్నా ఎవరికి వారు ప్లాస్టిక్ వినియోగంపై స్వీయ నియంత్రణ అవసరం. ప్రజా చైతన్యంతోనే ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టే అవకాశం ఉంటుంది. ఒక వైపు చట్టాలను అమలు చేస్తూ మరో వైపు ప్రజలను చైతన్య పరిస్తే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించే అవకాశం ఉంటుంది.



సీమౌత్‌ను రాళ్లతో పూడ్చివేసిన తీర ప్రాంత భూమి

ఎవరినడిగి.. సీమౌత్ పూడ్చారు..

"తీర ప్రాంతం విషయంలో కొన్ని నిబంధనలు ఉంటాయి. అందునా విశాల ప్రయోజనాలు ఇమిడి ఉన్న వాటిలో ముందస్తు అనుమతులు తప్పనిసరి. ఎవరి అనుమతులతో మీరు సీమౌత్‌ను రాళ్లతో పూడ్చివేశారు" డ్రైనేజీ, మత్స్య కార విభాగాలతో పాటు రెవెన్యూ యంత్రాంగం రియల్టర్ బుర్ల వెంకట్రావు కు సంధించిన సూటి ప్రశ్నలివి. ఈపూరుపాలెం సీమౌత్ పూడ్చివేత విష యంలో వెంకట్రావు తీరు ను తప్పుబడుతూ గంగ పుత్రులు గడచిన మూడు నెలలుగా వివిధ రూపాలలో ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. అత్యంత సున్నిత మైన ఈ అం శంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ వినోద్‌కుమార్ కమిటీని నియమించిన సంగతి కూడా తెలిసిందే. దీని లో భాగంగా కాలువ పూడ్చివేతపై వివరణ ఇవ్వాల్సిందిగా రియల్టర్ వెంకట్రావుకు సదరు విభాగాలు సంయుక్తంగా నోటీసులు జారీ చేశాయి.

- రియల్టర్ వెంకట్రావుకు నోటీసులు జారీ
- స్టేట్‌మెంట్ రికార్డు చేసిన రెవెన్యూ యంత్రాంగం
- కాలువలో వేసిన రాళ్లను తొలగించాలని ఆదేశం
- కోర్టును ఆశ్రయించిన రియల్టర్..
- కమిటీ నివేదిక రేపు కలెక్టర్ చేతికి!



సర్వే చేస్తున్న బాపట్ల తహసీల్దార్ షేక్ సలీమా (పాత చిత్రం)

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

వారం రోజుల క్రితం రియల్టర్ బుర్ల వెంకట్రావు రెవె న్యూ విభాగం ముందు హాజరు కాగా అతని స్టేట్ మెంట్‌ను అధికారులు రికార్డు చేశారు. ప్రాథమిక చర్య లలో భాగంగా కాలువలో వేసిన రాళ్లను తొలగించాల ని, లేదా అందుకు అయ్యే ఖర్చులు భరించాలని అధికారులు బుర్లను ఆదేశించినట్లు సమాచారం. ఈ ఆదేశాలిచ్చి కూడా వారం రోజులు దాటుతోంది. రాళ్లను తొలగించే కార్యక్రమం చేపట్టకపోగా రెవెన్యూ విభాగం ఇచ్చిన ఆదేశాలపై స్టే విధించాలని బుర్ల వెంకట్రావు హైకోర్టు మెట్లెక్కారు. పూర్తి వివరాలతో రెవెన్యూ విభాగం కోర్టుకు నివేదిక ఇచ్చినట్లు సమాచారం

కమిటీ నివేదిక రేపు కలెక్టర్ చేతికి!

వివాదం తాలూకా పూర్వాపరాలపై విచారణ చేపట్టి సమగ్ర నివేదిక ఇవ్వాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఓ కమిటీని గతంలో నియమించిన సంగతి తెలిసిందే. ఇంతకుముందు కలెక్టర్‌గా విధులు నిర్వహించిన వెంకటమురళి కూడా ఈ వివాదంపై కమిటీని నియ మించడం, నివేదిక తీసుకోవడం జరిగింది. కానీ తాజా కమిటీలో చీరాల ఆర్డీవో, డీఎస్పీకి కూడా చోటు కల్పించారు. నివేదికను కొలిక్కి (మిగతా 8వ పేజీలో)

చిన్నారిపై లైంగిక దాడి చేసిన వ్యక్తి అరెస్టు

● నిందితుడ్ని రోడ్డుపై నడిపించిన పోలీసులు



ఆస్పత్రి నుంచి కోర్టు వరకు నిందితుడ్ని నిడిపించి తీసుకెళ్తున్న పోలీసులు

చీరాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చీరాల మండలం ఈపూరుపాలెం పరిధిలో ఏడేళ్ల బాలికపై లైంగిక దాడి చేసిన పిట్ల సూరిబాబు అలియాస్ బిట్లను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. పప్పులు కొనిస్తానని చిన్నారిపై ఓ వ్యక్తి లైంగిక దాడికి పాల్పడి పారిపోయాడు. ఫోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు బుధవారం అరెస్టు చేసి ఈపూరుపాలెం స్టేషన్‌లో మీడియా ఎదుట హాజరుపరిచారు. ఆ తర్వాత చీరాల ఏరియా హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. పరీక్షల అనంతరం నిందితుడ్ని కోర్టు వరకు కాలి నడకన నడిపించారు. చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడితే చర్యలు తప్పవని డీఎస్పీ ఎండీ మొయిన్, సీఐ శేషగిరిరావు, ఎస్ఐ చంద్రశేఖర్ ఈ సందర్భంగా హెచ్చరించారు.

మోదీ సభకు ఆర్టీసీ బస్సులు

- కర్నూలుకు 250పైనే సర్వీసులు కేటాయింపు
- గుంటూరు నుంచి 180, బాపట్ల నుంచి 40 బస్సులు
- సామాన్య ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

గుంటూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ 2.0 సభకు కర్నూలుకు గురువారం విచ్చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ సభకు ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి ఆర్టీసీ బస్సులు తరలివెళుతున్నాయి. జీఎస్టీ సంస్క రణల తర్వాత గురువారం కర్నూలులో ప్రధాని నరేంద్రమోదీ, సీఎం



చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హాజరుకానున్న సభకు భారీగా జన సమీకరణ చేయనున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి 250 పైనే ఆర్టీసీ సర్వీసులు తరలివెళ్లనున్నాయి. అదే సమయంలో సామాన్య ప్రయాణికులకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. ప్రధాని సభకు సంబంధించి జన సమీకరణకు కండీషన్‌లో ఉన్న బస్సులు సమ కూర్చాలని ఉన్నతాధికారుల నుంచి కూడా స్పష్టమైన ఆదేశాలు జారీ అ య్యాయి. ఈ మేరకు గుంటూరు- 1, 2 డిపోలతో పాటు పొన్నూరు, మంగళగిరి, తెనాలి డిపోల నుంచి 180 సర్వీసులు అందుబాటులో ఉంచుతు న్నట్లు అధికారులు తెలిపారు. అలానే బాపట్ల జిల్లా నుంచి 40 సర్వీసులు ప్రధాని సభకు తరలిస్తున్నట్లు బాపట్ల జిల్లా ప్రజా రవాణాధికారి సామ్రా జ్యం తెలిపారు. పల్నాడు నుంచి కూడా అదనపు బస్సులు ప్రధాని సభకు తరలిస్తున్నారు. ఆయా బస్సులను బుధవారం రాత్రి నుంచే గమ్యస్థానా లకు చేర్చారు. నియోజకవర్గాల నుంచి జన సమీకరణకు సంబంధించి ప్రజాప్రతినిధులు బాధ్యత తీసుకుం టున్నారు. ప్రజాప్రతినిధుల సూచనల మేరకు బస్సులను ఆయా ప్రాంతాలలో గురువారం ఉదయమే అందుబాటులో ఉంచనున్నారు.

192.42 ఎకరాల్లో ఆక్వా పార్కు

● ఏడాదిలో పూర్తి చేయాలని ఆదేశాలు ● పనుల పరిశీలనలో కలెక్టర్ వినోద్‌కుమార్ ● స్వదేశీ దర్శన్ 2.0లో సూర్యలంక బీచ్ అభివృద్ధి

రేపల్లె, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నిజాంపట్నం మండలంలోని యేమినేనివారిపాలెంలో ఆక్వాపార్కుకు 192.42 ఎకరాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. యేమినేనివారిపాలెం హార్బర్‌లో ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్కు, ఓడరేవు అభివృద్ధి పనులను కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్వాపార్కు, ఓడరేవు నిర్మాణం ద్వారా మత్స్య, ఆక్వా రంగం మరింత అభివృద్ధి అవుతుందని, మత్స్యకారులకు ప్రయోజనం చేకూరు తుందన్నారు. టెండర్ ప్రక్రియ పూర్తయినా ఆక్వాపార్కు పనులు ప్రారంభించకపోవడానికి గల కారణాలపై మెరైన్ బోర్డు అధికారులను అడిగి తెలుసుకున్నారు. మొక్కలను తొలగించి రోడ్డు నిర్మాణం ప్రారంభించినట్లు కాంట్రాక్టర్ తెలిపారు.పనులను సంవత్సరంలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ జేడీ శ్రీనివాస్‌నాయక్, ఉపసంచాలకులు గాలిదేవుడు, ఆర్డీవో రామలక్ష్మి, ఇన్‌చార్జ్ తహసీల్దారు శ్రీనివాసరావు, మెరైన్‌బోర్డు డీఈ సూర్యనారాయణ పాల్గొన్నారు.

బీచ్ పనులను ప్రారంభించాలి

బాపట్ల: స్వదేశీ దర్శన్ 2.0 కింద సూర్యలంక బీచ్ అభివృద్ధి పనులను గురువారం నుంచి ప్రారంభించాలని కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వదేశీ దర్శన్ 2.0 కింద సూర్యలంక బీచ్ అభివృద్ధికి కేంద్రప్రభుత్వం రూ.97.52 కోట్లు విడుదల చేసిందన్నారు. 3.5 ఎకరాల విస్తీర్ణంలో పర్యాటకుల సౌకర్యార్థం మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. 1.5 కిలోమీటర్ల దూరం వరకు బోట్ల ద్వారా కెనల్‌లో పర్యటించేందుకు అభివృద్ధి చేయాలన్నారు. ఆయా పనులు 2026 సెప్టెంబరుకి పూర్తి చేయాలన్నారు. ఓడరేవు-చిలకలూరిపేట జాతీయ రహదారి 167ఏ నిర్మాణం సత్వరమే పూర్తి చేయాలని కలెక్టర్ చెప్పారు. ఈ సమావేశంలో పర్యాటకశాఖాధికారి నాగిరెడ్డి, జిల్లా మత్స్యకాధికారి శ్రీనివాసనాయక్ పాల్గొన్నారు.



ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్కు, ఫిషింగ్‌హార్బర్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్


చురుగ్గా అండర్‌పాస్‌లు

హైవేపై రూ.67 కోట్లతో పనులు ● రాజుపాలెం, జొన్నతాళి వద్ద నిర్మాణం

మార్టూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చెన్నై నుంచి కలకత్తా 216వ జాతీయ రహదారి మార్టూరు మండల పరిధిలో జొన్నతాళి రోడ్డు వద్ద, రాజుపాలెం కూడలి వద్ద అండరుపాస్ నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. 15 ఏళ్ల క్రితం మార్టూరులో జాతీయరహదారిని దశలు వారీగా ఆరు లైన్లుగా విస్తరించారు. మార్టూరు సెంటరులో ఒక పెద్ద అండరుపాస్, రెండు చిన్న అండరుపాస్‌లు, ఇసుకదర్శి సెంటరు, కోనంకి సెంటరు వద్ద రెండు పెద్ద అండరుపాస్‌లను ఏర్పాటు చేశారు. అయితే రాజుపాలెం కూడలి వద్ద, జొన్నతాళి రోడ్డు వద్ద అండరుపాస్‌లను నిర్మించలేదు. చీరాల నుంచి వినుకొండ వెళ్లే వారు మార్టూరులో జాతీయరహదారిని దాటేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో రాజుపాలెం కూడలి వద్ద పెద్ద అండరుపాస్ ఏర్పాటు చేస్తున్నారు. జొన్నతాళి రోడ్డు వద్ద రోడ్డుకు రెండు వైపులా గ్రానైట్ పరిశ్రమలు ఉండటంతో, వాటిలో ముడిరాయిని బల్లికురవ, సంతమాగులూరు మండలాల నుంచి లారీల్లో తరలిస్తుంటారు. ఇక్కడ కూడా అండర్ పాస్ నిర్మాణం చేపట్టారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చొరవతో రూ.67 కోట్లతో నిర్మిస్తున్న అండర్‌పాస్‌లతో వాహనదారులకు ఇబ్బందులు తొలగిపోనున్నాయి. వచ్చే ఏడాది మార్చిలోపు రెండు అండరుపాస్‌ల నిర్మాణాలు పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయి.



జొన్నతాళి రోడ్డు వద్ద నిర్మాణంలో ఉన్న అండర్ పాస్



రాజుపాలెం కూడలి వద్ద నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి

సర్వీసు రోడ్లలో ప్రమాదాలు..

హైవేపై రెండు అండరుపాస్‌ల నిర్మాణాలతో జొన్నతాళి రోడ్డు, రాజుపాలెం కూడలి వద్ద కొంతమేర సర్వీసు రోడ్డులో వాహనాలు ప్రయాణిస్తున్నాయి. సర్వీసు రోడ్లలో వాహనాలు ఎదురెదురుగా వస్తున్న సమయంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. జొన్నతాళి రోడ్డు వద్ద సర్వీసు రోడ్డులో రాత్రి సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. జొన్నతాళి రోడ్డు సమీపంలో మద్యం దుకాణం ఉంది. ఈ క్రమంలో ఇక్కడ ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.

భూ సమస్యలన్నీ పరిష్కరిస్తాం

● జేసీగా బాధ్యతలు స్వీకరించిన భావన వశిష్ఠ

బాపట్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని భూ సమస్యలన్నీ పరిష్కరిస్తామని జేసీ భావన వశిష్ఠ తెలిపారు. జేసీగా బుధవారం భావన బాధ్యతలు స్వీకరించారు. తొలుత కలెక్టరేట్‌కు చేరుకున్న ఆమెకు అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. వేదపండితుల మంత్రోచ్ఛరణ, పూర్ణాకుంభంతో స్వాగతిస్తూ కార్యాలయంలో పూజలు నిర్వహించారు. జేసీగా బాధ్యతలు చేపట్టిన ఆమె కలెక్టర్ వినోద్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రెవెన్యూ వ్యవస్థలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రజలు భూసమస్యలతో ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు మేలు చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, కలెక్టరేట్ ఏవో మల్లికార్జునరావు, ఆర్డీవోలు పి.గ్లోరియా, చంద్రశేఖర్‌నాయుడు, ఎన్.రామలక్ష్మి, తహసీల్దార్ షేక్.సలీమా స్వాగతం పలికారు.



కలెక్టర్ వినోద్‌కుమార్‌కు మొక్క అందజేస్తున్న జేసీ భావన వశిష్ఠ

సీసీ రోడ్లకు రూ.9.78 కోట్లు

ఎమ్మెల్యే ఏలూరి చొరవతో కొత్తరూపు

కారంచేడు(పర్చూరు), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కారంచేడు మండల రహదారుల అభివృద్ధికి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక చొరవతో రూ.9.78 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో రోడ్లు కొత్త రూపు సంతరించుకోనున్నాయి. ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద సీసీ రోడ్లు, డ్రెయిన్ల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి. మండలంలోని ఆదిపూడి గ్రామానికి రూ.52.50 లక్షలు, దగ్గుబాడు గ్రామంలో ఏడు పనులకు రూ.82.50 లక్షలు, జరుబులవారిపాలేనికి రూ.35 లక్షలు, కేశవరప్పాడుకి రూ.35 లక్షలు, కొడవలివారిపాలేనికి రూ.55 లక్షలు, కుంకలమర్రుకి రూ.77.50 లక్షలు, నాయుడువారిపాలేనికి రూ.55 లక్షలు, రంగప్పనాయుడువారిపాలేనికి రూ.20 లక్షలు, స్వర్ణ గ్రామానికి రూ.1.10 కోట్లు, తిమిడితివారిపాలేనికి రూ.80.50 లక్షలు, కారంచేడులో 16 పనులకు రూ.2.49 కోట్లు, యర్రంవారిపాలెం గ్రామానికి రూ.10 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి.

పూండ్ల రైతుల కష్టాలకు చెక్

● ఎట్టకేలకు భూ రిజిస్ట్రేషన్లకు అవకాశం

బాపట్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): భూములు ఉన్నా.. క్రయవిక్రయాలకు నోచుకోక దశాబ్దకాలానికిపైగా పూండ్ల గ్రామ రైతులు పడిన కష్టాలు తప్పాయి. 1045.54 ఎకరాల భూమికి సంబంధించి ఆన్‌లైన్‌లో తప్పులను అధికారులు సవరించడంతో రిజిస్ట్రేషన్లకు అవకాశం వచ్చింది. 2012 నుంచి గ్రామ రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ వచ్చారు. సుమారు 750 మంది రైతులకు చెందిన 1045.54 ఎకరాల భూమి అడంగళ్‌లోని 6వ కాలమ్‌లో పట్టాభూమి అని లేదు. దీంతో రిజిస్ట్రేషన్లకు నోచుకోకపోవడంతో రైతులు అధికారులు, పాలకుల చుట్టూ తిరుగుతూ వచ్చినా సమస్య పరిష్కారం కాలేదు. ఈ క్రమంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరారు. దీంతో ఆర్డీవో పి.గ్లోరియా, తహసీల్దార్ షేక్ సలీమాలు జూలైలో గ్రామసభ నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. వాటిని పరిశీలించి 956 సర్వే నెంబర్లను ఆన్‌లైన్‌లో సరిచేసి భూములను మొత్తం పట్టాభూమిగా తిరిగి చేశారు. దీంతో రిజిస్ట్రేషన్ సజావుగా జరిగే ఏర్పాటు చేశారు. సమస్యను పరిష్కరించినందుకు గ్రామస్థులు ఎమ్మెల్యేతో పాటు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

నిషేధమా అదెక్కడ..?

(5వ పేజీ తరువాయి)

పూర్తిగా విఫలమవుతోంది. నిషేధం ప్రచారానికే పరిమితమవుతోంది. యథేచ్ఛగా నిషేధిత ప్లాస్టిక్ వినియోగం, విక్రయాలు సాగుతున్నా... చర్యలు తీసుకోవాల్సిన యంత్రాంగం చోద్యం చూస్తోంది.

● పర్యావరణంపై తీవ్ర ప్రభావం

పర్యావరణంపై ప్లాస్టిక్ వ్యర్థాలు తీవ్ర ప్రభావం చూపుతాయి. కాలువల్లో పూడిక తీసే సమయంలో పెద్ద ఎత్తున ప్లాస్టిక్ కవర్లు, సీసాలు, గ్లాసులు ఉంటున్నాయి. ఈ కవర్ల వినియోగంపై నియంత్రణ కనిపించటం లేదు. విందు, వినోదాలలో కూడా ప్లాస్టిక్ గ్లాసులు, పేపర్ సామగ్రిని వినియోగిస్తున్నారు. చివరకు కూరలు, అహారం ప్యాకింగ్‌లో కూడా ప్లాస్టిక్ పేపర్, కవర్లను వాడుతున్నారు. వేడి అహార పదార్థాలను ప్లాస్టిక్ కవర్లలో ప్యాకింగ్ చేయడం వల్ల అవి కరిగి అహారంలో కలసిపోతూ ప్రాణ సంకటంగా మరుతున్నాయి. అలాగే పట్టణాలలో ఏ మురుగు కాలువ చూసినా ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు కన్పిస్తున్నాయి.మురుగు కాలువలు పూడిపోవటానికి ప్లాస్టిక్ ఒక కారణంగా ఉంది. పట్టణాలలో ప్రతిరోజు ఉత్పత్తి అయ్యే వ్యర్థాలలో నాలుగో వంతు ప్లాస్టిక్ వ్యర్థాలు ఉంటున్నాయి.

మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డిపై కేసు నమోదు

నరసరావుపేట లీగల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు మొదటి పట్టణ సీఐ శక్తి ఫిరోజ్ బుధవారం తెలిపారు. పట్టణంలో సెక్షన్ 30 అమలులో ఉందని, మంగళవారం అనుమతులు లేకుండా ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టడంతో.. డాక్టర్ గోపిరెడ్డితో పాటు మరో 22 మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.



మేజర్ భరద్వాజ్ పార్థీవ దేహానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్, ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ తదితరులు



మేజర్ తేజ్ భరద్వాజ్ అంతిమ యాత్రలో పాల్గొన్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే గళ్లా మాధవి, ఆర్డీవో శ్రీనివాసరావు తదితరులు

తేజ్.. అమర్‌రహే

మేజర్ భరద్వాజ్‌కు కన్నీటి వీడ్కోలు

అధికార లాంఛనాలతో ఘనంగా అంత్యక్రియలు

నివాళులర్పించిన కలెక్టర్, ఎస్పీ, ప్రజాప్రతినిధులు, ప్రజలు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్‌లో యుద్ధ విన్యాసాలు చేస్తూ మరణించిన గుంటూరుకు చెందిన మేజర్ తేజ్‌భరద్వాజ్‌కు కుటుంబసభ్యులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు బుధవారం కన్నీటి వీడ్కోలు పలికారు. తొలుత ఉదయం సంగడిగుంటలోని ఆయన నివాసం వద్ద సైనిక సెరిమోని నిర్వహించారు. సంగడిగుంట, ఆర్‌అగ్రహారం మీదగా శ్రీనివాసరావుపేట, కైలాసిగిరి వరకు అంతిమయాత్ర సాగింది. దాదాపు గంటసేపు సాగిన మేజర్ అంతిమయాత్రలోప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పార్థీవదేహంపై పూలు జల్లుతూ అమర జవాను.. అమర్‌రహే అం టూ నినాదాలు చేశారు. అనంతరం మధ్యాహ్నం శ్రీనివాసరావుతోట లోని కైలాసగిరిలో అధికార లాంఛనాలతో మేజర్ అంత్యక్రియలను పూర్తి చేశారు.

తరలివచ్చిన అధికారులు, ప్రజాప్రతినిధులు

మేజర్ అంతిమయాత్రలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు సంఖ్యలో పాల్గొన్నారు. తొలుత ఆయన నివాసం వద్ద మేజర్ పార్థీవ దేహానికి కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ వకుల్‌జిందాల్, నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, ఆర్డీవో శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు నసీర్ అహమ్మద్, గళ్లా మాధవి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి, వైసీపీ తూర్పు ఇన్‌చార్జి నూరిఫాతిమా, తూర్పు తహసీల్దారు సుభాని తదితరులు నివాళులర్పించారు. ఆపరేషన్ సింధూర్‌లో తేజ్ చురుగ్గా పాల్గొన్నారని గుర్తు చేసుకున్నారు. మేజర్ త్యాగం మరవలేనిదన్నారు. కుటుంబ సభ్యులకు అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.

తెనాలిలో నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి

● రాత్రి 11 గంటలు దాటి రోడ్లపై తిరిగితే చర్యలు ● ఎస్పీ వకుల్ జిందాల్

తెనాలి క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తెనాలిలో పూర్తిస్థాయిలో నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా ఎస్పీగా మొదటిసారి ఆయన పట్టణ పోలీసుస్టేషన్‌ను బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ.. రౌడీషీటర్లు, నేర చరిత్ర ఉన్నవారి కదలికలపై ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని చెప్పారు. పోలీసు గస్తీ, బీట్ల సంఖ్యను మెరుగుపరుస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళలపై హింసాత్మక ఘటనలు, లైంగిక వేధింపుల కేసుల్లో కఠినంగా వ్యవహరించాలని అధికారులకు ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. గంజాయిపై పోలీసులకు సమాచారం అందిస్తే వెంటనే వారిని అదుపులోకి తీసుకుంటామన్నారు. సైబర్ నేరాలపై దగ్గరలోని పోలీసుస్టేషన్ లేదా 112, 1930 నంబర్లను సంప్రదించాలని సూచించారు. తెనాలి పట్టణంలో రాత్రి 11 గంటలు దాటిన తర్వాత ఒంటరిగా, గ్రూపులుగా కారణం లేకుండా రోడ్లపై తిరుగుతుంటే.. పోలీసులు విచారణ చేసి.. అవసరమైతే అదుపులోకి తీసుకుంటారన్నారు. పట్టణ పోలీసు క్వార్టర్స్ శిథిలావస్థలో ఉన్నాయని, వాటి స్థానంలో నూతన భవనాలు ఏర్పాటు ప్రభుత్వ పరిశీలన ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయా పోలీస్‌స్టేషన్లలోని రౌడీషీటర్లు, కేసుల పరిష్కారం వివరాలను ఎస్‌హెచ్‌వోలను అడిగి ఎస్పీ తెలుసుకున్నారు. డీఎస్పీ జనార్దనరావు, పట్టణ సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ వకుల్ జిందాల్

ఉరేసుకొని వివాహిత మృతి

● చేబ్రోలు ఉప్పరపాలెంలో ఘటన ● భర్త వేధింపుల వల్లేనని ఆమె తల్లిదండ్రుల ఆరోపణ



వైజయంతి (ఫైల్‌ఫొటో)

చేబ్రోలు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం ఉప్పరపాలెంలో బుధవారం ఓ వివాహిత ఉరేసుకొని అనుమానాస్పద రీతిలో మృతి చెందింది. భర్త వేధింపుల వల్లే తమ కుమార్తె ప్రాణాలు తీసుకుందని ఆమె తల్లిదండ్రుల ఆరోపిస్తున్నారు. చేబ్రోలు ప్రాంతానికి చెందిన ప్రసాద్ అనే వ్యక్తికి, అదే ప్రాంతానికి చెందిన వైజయంతికి (23) నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. వివాహ సమయంలో రూ. 50 వేల నగదు, కొంత బంగారం కట్నంగా ఇచ్చారు. అంతేకాక ఒక సెంటు భూమి ఇస్తామని వైజయంతి తల్లి హామీ ఇచ్చినట్లు సమాచారం. వీరికి ఏడాది క్రితం ఓ ఆడశిశువు పుట్టింది. అయితే గత కొంతకాలంగా భూమి కాగితాలు తీసుకురావాలని భర్త ప్రసాద్, అత్త ఉష తరచూ వైజయంతిని వేధిస్తున్నారని కుటుంబసభ్యులు తెలిపారు. ఈ క్రమంలో ప్రసాద్ మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని, దాంతో తనను వేధించడం పెంచాడని వైజయంతి తన తల్లిదండ్రుల వద్ద వాపోయినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో బుధవారం వైజయంతి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. చేబ్రోలు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని, మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వీరనారాయణ తెలిపారు.

మంగళగిరి బెటాలియన్‌లో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం

● హాజరు కానున్న సీఎం, హోంమంత్రి.. ● భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

గుంటూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం ఈ దఫా మంగళగిరి బెటాలియన్‌లో నిర్వహించ నున్నారు. ఈ నెల 21న రాష్ట్ర స్థాయిలో జరిగే కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు, హోం మంత్రి, ఇతర మంత్రులు, ప్రముఖులు హాజరుకానున్నారు. ఈ మేరకు బుధ వారం ఆయా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పరిశీలించారు. కార్యక్రమం జరుగబోయే ప్రదేశాన్ని సమీక్షించి, భద్రతా ఏర్పాట్లు, అమరవీరుల స్తూపం, స్టేజి నిర్మాణం, పరేడ్ నిర్వహణ స్థలం, అలాగే అధికారులు, సిబ్బంది కూర్చునే ఏర్పాట్లు వంటి అంశాలను పరిశీలించి, సమీక్షించారు. ప్రతీ విభాగం సమన్వయంతో పని చేయాలని సూచించారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకునే ఈ వేడుకను గౌరవప్రదంగా, అద్భుతంగా నిర్వహించేందుకు ప్రతి శాఖ, ప్రతి అధికారి సమన్వ యంతో పనిచేయాలని, ప్రతి ఏర్పాటును జా గ్రత్తగా, సమయానికి పూర్తి చేయాలని ఎస్పీ సూచించారు. అలాగే, పరేడ్ నిర్వహణలో పాల్గొనే ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్, కమ్యూనికేషన్, ఏఆర్, సివిల్ పోలీ సులు తదితర విభాగాలు పరస్పర సహకారంతో పనిచేసి, అమర వీరుల దినం రాష్ట్రంలో ఆదర్శప్రాయంగా నిలవాలనే లక్ష్యంతో కృషి చేయాలని ఎస్పీ అన్నారు. 6వ బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్ మురళీ, గుంటూరు జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) రమ ణమూర్తి, సబ్ డివిజనల్ పోలీస్ అధికారులు, బెటాలియన్ కమాండ్ అధికారులు, ఇంజినీరింగ్, టెక్నికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మంగళగిరి బెటాలియన్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

క్వాంటమ్‌పై జిల్లా స్థాయి సైన్సు సెమినార్

నరసరావుపేట కల్చరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): క్వాంటమ్ సాంకేతికపై ఈ నెల 17న జిల్లా స్థాయి సెమినార్ నిర్వహిస్తున్నట్లు పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారిఎల్. చంద్రకళ బుధవారం తెలిపారు. క్వాంటమ్ యుగ ప్రారంభం - అవకాశాలు, సవాళ్లు అనే అంశంపై ఈ సెమినార్ ఉంటుందన్నారు. ఈ నెల 17న శంకరభారతిపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంటలకు జరుగుతుందన్నారు. ఈ సెమినార్ నందు అన్ని యాజమాన్య పాఠశాలలో చదువుతున్న 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొనడానికి అర్హులని చెప్పారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు 5 చార్ట్ లేదా స్లైడ్స్ ఉపయోగించుకుని గరిష్ఠంగా 6 నిమిషాల పాటు ప్రజంటేషన్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రదర్శన కనబరచిన ఇద్దరిని రాష్ట్ర స్థాయి పటీ ఎంపిక చేస్తానమి చెప్పారు. వీరు విజయవాడలో 18న జరిగే సెమినార్‌లో పాల్గొంటారని తెలిపారు. 30న బెంగళూరులో జాతీయస్థాయి సెమినార్‌లో పాల్గొనాల్సి ఉంటుందని చెప్పారు. ఇతర వివరాలకు జిల్లా సైన్స్ అధికారి ఎస్.రాజశేఖర్ (9959004434)ను సంప్రదించాలన్నారు.

49,453 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 50,748 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 49,453 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 15,250 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	12500
334	10000	15200	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	14200	334	10500	15000
273	10500	13800	నెంబరు. 5	10000	14500
341	10000	15500	341	10000	15600
4884	----	---	4884	---	----
సూపర్ 10	----	---	సూపర్ 10	----	---
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	15200	తేజ	10000	15000
షార్క్-1	-----	---	బ్యాడిగి	10000	15500
బ్యాడిగి	10500	15800	దేవనూరు డీలక్స్	10500	14800
దేవనూరు డీలక్స్	10000	14700	తాలుకాయలు	5000	8000

సూర్యలంక తీరంలో సూపర్ జీఎస్టీపై సైకతా శిల్పం

బాపట్ల రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా బాపట్ల మండలం సూర్యలంక తీరంలో బాపట్ల టూరిజం ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించే ందుకు సైకతా శిల్పాన్ని నిర్మించారు. ఇంటర్నేషనల్ శాండ్ ఆర్టిస్ట్ బాలాజీ వరప్రసాద్ నిర్మించిన సైకతా శిల్పం పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌తో ప్రజలకు కలిగే లాభాలు గురించి శిల్పంలో వర్ణించడం పర్యాటకులను ఆకర్షిస్తున్నది.



సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై సూర్యలంక తీరం ఒడ్డున కళాకారుడు చిత్రీకరించిన సైకతా శిల్పం

డిజిటల్ ఇండియా మార్గదర్శిగా ఏపీ

● శిల్పారామం చైర్‌పర్సన్ మంజులారెడ్డి

రెంటచింతల,అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్టణంలో గూగుల్ సంస్థ రూ.87,500 కోట్ల పెట్టుబడితో దక్షిణ ఆసియా ఖండంలోనే అతిపెద్ద డేటా సెంటర్ క్లస్టర్ నిర్మించడానికి ముందుకు రావడం టెక్ విప్లవానికి నాంది అని శిల్పారామం చైర్‌పర్సన్ చేర్రెడ్డి మంజులారెడ్డి పేర్కొన్నారు. బుధవారం రెంటచింతలలో ఆమె మాట్లాడుతూ.. ఇప్పటి వరకు సిటీ ఆఫ్ డెస్టినిగా ఉన్న విశాఖ నగరం ఇకపై ఏఐ డిజిటల్ సిటీ రాజధానిగా మారనుందన్నారు. డిజిటల్ ఇండియాలో మన రాష్ట్రం దేశానికి మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. రాష్ట్రంలో యువతకు ఐటీ రంగంలో 5 లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ పనిచేస్తున్నారన్నారు. గూగుల్ ఏర్పాటు కోసం మంత్రి లోకేశ్ నిరంతరం శ్రమించారని, ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ సాంకేతిక పటంలో నిలబెట్టబోతున్నారని కొనియాడారు.

పెదకాకాని ఆలయ హుండీల కానుకల లెక్కింపు

● 77 రోజుల ఆదాయం రూ.36,36,324



శివాలయంలో హుండీలు లెక్కిస్తున్న సిబ్బంది

పెదకాకాని, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం కానుకల హుండీలను తెరచి, కల్యాణ మండపంలో లెక్కించినట్లు ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలాకుమార్ తెలిపారు. దేవదాయశాఖ పర్యవేక్షణాధికారిగా జ్యూయలరీ వెరిఫికేషన్ అధికారి పి. సైదమ్మబాయి వ్యవహరించారు. 77 రోజులకు గాను రూ.36,36,324, అన్నదానం హుండీ ద్వారా రూ.2,05,399, బంగారం 8.500 మి.గ్రా, వెండి 340 గ్రాములు, యూఎస్ఏ డాలర్లు 24, ఆస్ట్రేలియా డాలర్లు 70, కెనడా డాలర్లు 50, ఇంగ్లాండు పౌండ్లు 10 వచ్చాయని దేవస్థాన ఉప కమిషనర్ తెలిపారు.

అంబటిని మించిన బడుద్దాయి మరొకరు లేరు: కనపర్తి

గుంటూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజకీయాల్లో మాజీ మంత్రి అంబటి రాంబాబుని మించిన బడుద్దాయి, బఫూన్ మరొకరు లేరని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు మండిపడ్డారు. పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మంత్రి లోకేశ్‌పై కారుకూతలు కూస్తే అంబటికి బడితె పూజ తప్పదని హెచ్చరించారు. 30 ఏళ్ల తర్వాత ఎమ్మెల్యేగా అతి కష్టమ్మీద రెండోసారి గెలుపొందిన ఆయన చరిత్ర జిల్లా ప్రజలకు తెలియంది కాదన్నారు. రేపల్లెలో ఓడిన రెండుసార్లు టీడీపీ అభ్యర్థికి వచ్చిన మెజార్టీ అన్ని ఓట్లు కూడా అంబటికి రాకపోవడం సిగ్గుచేటన్నారు. నారా లోకేశ్ ఓడినచోటే మళ్లీ పోటీ చేసి పులివెందులలో జగన్‌రెడ్డికి సైతం ఎప్పుడూ రాని మెజార్టీతో విజయం సాధించారన్నారు. అంబటి దెబ్బకు ఏపీసీసీ సైతం భయపడి.. గతంలో 25,000 ఓట్ల తేడాతో ఓడిన వారెవరూ అభ్యర్థిత్వం కోసం దరఖాస్తు చేయవద్దని హెచ్చరించిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. అంబటి పులివెందులలో తప్ప ఎక్కడ నుంచి పోటీచేసినా డిపాజిట్లు రావని వైఎస్‌తో ఏపీసీసీ పెద్దలు చెప్పిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. రేపల్లె ప్రజలు తన్ని, తరిమేస్తే సత్తెనపల్లి వచ్చి పడిన ఆయనను, అక్కడ సొంత పార్టీ నేతలే తీవ్రంగా ఛీకొడితే మళ్లీ గుంటూరు వచ్చి పడ్డాడన్నారు. లోకేశ్‌పై అంబటి రాంబాబు మరోసారి నోరు పారేసుకుంటే పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని కనపర్తి హెచ్చరించారు.

ఎవరినడిగి... సీమౌత్ పూడ్చారు !

(5వ పేజీ తరువాయి)

తెచ్చే ప్రక్రియలో భాగంగా ఈపూరుపాలెం స్ట్రెయిట్‌కట్ డ్రైయిన్ సముద్రంలో కలిసే ప్రాంతంలో మంగళవారం రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టారు. డ్రైనేజీ విస్తీర్ణం ఎంత అనే అంశంతో పాటు పట్టా, డీకే భూముల వివరాలు హద్దులతో సహా సర్వే చేసి నివేదికలో పొందుపరిచారు. ఈ వివరాలతో పాటు గతంలో జరిగిన ఘటనల సమగ్ర వివరాలతో రిపోర్టును శుక్రవారం కలెక్టర్ వినోద్‌కుమార్‌కు అందించడానికి కమిటీ సిద్ధమవుతోంది

నిబంధనలపై ముమ్మర కసరత్తు...

తీర ప్రాంత భూముల విషయంలో అవలంభించాల్సిన నిబంధనలపై రెవెన్యూ యంత్రాంగం ముమ్మర కసరత్తు చేస్తోంది. దానిలో భాగంగా గతంలో జరిగిన కొన్ని కేస్ స్టడీస్‌ను కూడా పరిశీలన చేస్తున్నారు. తీర ప్రాంత భూములపై యాజమాన్య హక్కు కలిగి ఉన్నప్పటికీ, సదరు విభాగాల అనుమతి లేకుండా ప్రవాహం దిశ మార్చడం నిబంధనల ఉల్లంఘన కిందకే వస్తుందనే ప్రాథమిక అంచనాకు సదరు విభాగాలు వచ్చినట్లు తెలుస్తోంది. స్టేట్‌మెంట్ రికార్డు సమయంలో రియల్టర్ బుర్ల వెంకట్రావును ఇదే విషయంపై వివరణ అడిగినట్లు తెలుస్తోంది. ఇదే కాకుండా సీమౌత్ వివాదంలో కొంత అసైన్డ్ భూమి భాగమై ఉండడం ఒక ఎత్తయితే పట్టా భూమి రికార్డుల విషయంలో కూడా అనేక సందేహాలను కమిటీ ఇవ్వబోతున్న నివేదికలో పొందుపరిచినట్లు తెలుస్తోంది

వివాదానికి ముగింపు పలకాల్సిందే...

దాదాపు మూడు నెలలుగా ఈపురుపాలెం స్ట్రెయిట్‌కట్ విషయంలో మత్స్యకారులు వివిధ రూపాలలో ఆందోళనలు చేస్తున్న సంగతి తెలిసిందే. పలుమార్లు ధర్నాలు, కలెక్టరేట్ ముట్టడిలాంటి కార్యక్రమాలతో ఉద్రిక్త వాతావరణం కూడా కొన్ని సందర్భాల్లో ఏర్పడుతోంది. ఈ వివాదానికి ఎట్టి పరిస్థితుల్లో మరో వారం రోజుల్లో ముగింపు పలకాల్సిందేనని కలెక్టర్ వినోద్‌కుమార్ పట్టుదలతో ఉన్నట్లు తెలుస్తోంది. దీనిలో భాగంగానే కమిటీ ఇచ్చే నివేదికతో పాటు వివిధ మార్గాలలో ఆ వివాదంపై సమాచారం తెప్పించుకునే పనిలో నిమగ్నమయ్యారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	123, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

జిల్లాలో అందుబాటులో 308 మెట్రిక్ టన్నుల యూరియా

● కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్



బాపట్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 308 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉన్నట్లు కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. ఈ విషయమై బుధవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో యూరియా కొరత లేదనే సమాచారాన్ని వ్యవసాయశాఖాధికారులు రైతులకు తెలియజేయాలన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఆర్ఎస్‌కేలు, పీఏసీఎస్ కేంద్రాలు 37 ద్వారా 412 మెట్రిక్ టన్నుల యూరియాను 4786 మంది రైతులకు పంపిణీ చేయటం జరిగిందన్నారు. ఇంకా 308 మెట్రిక్‌టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు.

పర్యాటకులు ప్రమాదాలకు గురికాకుండా చూడాలి

బాపట్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని బీచ్‌లకు వచ్చే పర్యాటకులు ప్రమాదాలకు గురికాకుండా ప్రణాళికలు తయారు చేయాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బాపట్ల, చీరాల, రామాపురం బీచ్‌లలో పర్యాటకులు ప్రమాదాలకు గురికాకుండా తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం కలెక్టర్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల రామాపురం బీచ్‌లో ఐదుగురు పర్యాటకులు ఈతకొడుతూ ప్రమాదానికి గురై మరణించారన్నారు. బీచ్‌లో సముద్ర స్నానాలకు వచ్చే పర్యాటకులకు ఆడియో, వీడియోల ద్వారా అవగాహన కల్పించాలని చెప్పారు. సముద్రస్నానానికి వెళ్ళే వారు మద్యం సేవించకుండా వెళ్ళేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మద్యం సేవించిన వారిని తనిఖీలు చేపట్టటానికి పోలీసు సిబ్బందికి బ్రీత్ ఎనలైజర్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. రిసార్ట్స్‌కు వచ్చే పర్యాటకులకు ప్రమాదాలపై అవగాహన కల్పించాలని యజమానులకు సూచించారు. కాన్ఫరెన్స్‌లో జిల్లా టూరిజం అధికారి నాగిరెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, డీఎఫ్‌వో వినోద్, ఆయా ప్రాంతాల రిసార్ట్‌ల ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతుబజారు తనిఖీ చేసిన మార్కెటింగ్ శాఖ ఏడీ

బాపట్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల రైతు బజారును మార్కెటింగ్ శాఖ ఏడీ కారుమూరి రమేష్‌బాబు బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రైతుబజారులో ఉన్న మౌలిక వసతులను ఆయన పరిశీలించారు. విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులు పండించి అమ్ముకోవటానికి తెచ్చుకున్న కూరగాయలు, ఆకుకూరలు కేటాయించిన దుకాణాలలోనే విక్రయించుకోవాలని చెప్పారు. మున్సిపల్ రోడ్డును ఆక్రమించి విక్రయాలు జరపరాదన్నారు. అద్దె కట్టించుకోకుండా ఉచితంగా దుకాణాలను కేటాయించటం జరిగిందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతుబజారులో ఎస్టేట్ అధికారి పొందు పరిచినటువంటి రోజువారి రేట్లకు కూరగాయలను విక్రయించాలన్నారు. త్వరలో బాపట్ల పరిసర ప్రాంతాలలో సమావేశాలు ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పిస్తానన్నారు. కార్యక్రమంలో రైతుబజారు ఎస్టేట్ అధికారి జి.ఫణేంద్ర, మార్కెటింగ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



బాపట్ల రైతుబజారును తనిఖీ చేస్తున్న మార్కెటింగ్ శాఖ ఏడీ కారుమూరి రమేష్‌బాబు

సైనికుడు గోపిరెడ్డి మృతి బాధాకరం

● మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాండ్ర

బాపట్ల, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సైనికుడు ఆసోది గోపిరెడ్డి మృతి చెందటం బాధాకరమని మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు అన్నారు. మండలంలోని ఆసోదివారిపాలెం గ్రామానికి చెందిన సోల్జర్ ఆసోది గోపిరెడ్డి గత నెల 29వ తేదిన రోడ్డుప్రమాదంలో గాయపడి హైదరాబాద్ గాంధీ హాస్పటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందటంతో బుధవారం భౌతికకాయాన్ని స్వగృహానికి తీసుకొచ్చారు. ఆయన భౌతికకాయంపై జాతీయ జెండా కప్పి మాజీ సైనికులు పుష్పాంజలి ఘటించి అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక వెల్ఫేర్ కార్యాలయ సిబ్బంది మునిపల్లె శ్రీనివాసరావు, మాజీ సైనిక సంఘ నాయకులు సీహెచ్ కృష్ణారావు, షేక్ మొయినుద్దీన్, సుంకర శేషగిరిరావు, రామకృష్ణారెడ్డి, గోవర్ధనరెడ్డి, పి.రాధాకృష్ణమూర్తి, రక్ష్మధరావు, రాయపూడి శ్రీనివాసరావు, అబ్దుల్ రహమాన్, పసుపులేటి ప్రసాద్, వసంతరావు, డి.వెంకటేశ్వర్లు, కావూరి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావులు ఆయన మృతికి సంతాపం ప్రకటించారు.



సైనికుడు ఆసోది గోపిరెడ్డి మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు తదితరులు

ముగిసిన క్లాప్ మిత్ర, ఎస్‌డబ్ల్యూ షెడ్స్ మిత్రాలకు శిక్షణ

పిట్టలవానిపాలెం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన పిట్టలవానిపాలెం మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో అన్ని గ్రామపంచాయతీల పరిధిలోని ఎంపీఆర్‌సీ, గ్రీన్ అంబాసీడర్స్ అండ్ గ్రీన్స్ గార్డ్స్, క్లాప్ మిత్రాలకు బుధవారం ఎంపీడీవో సీహెచ్ శేఖర్ అధ్యక్షతన ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. థీమ్-5 క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ 2025-2026 సంవత్సరానికి సంబంధించి వివిధ అంశాలపై గ్రామపంచాయతీ కార్యదర్శులు, గ్రామసర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లకు రెండో విడత శిక్షణ నిర్వహించగా శిక్షకులుగా సాయి ప్రభాకర్, పిట్టలవానిపాలెం మండల గ్రామపంచాయతీ కార్యదర్శి ఎ.ప్రసాదరావు, ఎంపీడీవో కార్యాలయ సీనియర్ సహాయకులు నాగరాజు, పారిశుధ్య నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ పంచాయతీలకు చెందిన ఎస్‌డబ్ల్యూ షెడ్స్ మిత్రాలు, అన్ని గ్రామపంచాయతీల క్లాప్ మిత్రాలు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా తొలుత పిట్టలవానిపాలెంలో గల చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఈ శిక్షణకు వచ్చిన డంపింగ్ యార్డు మిత్రాలు, క్లాప్ మిత్రాలకు అక్కడ నిర్వహిస్తున్న గ్రామ పంచాయతీ పనితీరును వారికి తెలియజేశారు.

రొయ్యల చెరువుల విద్యుత్ మీటర్లు తనిఖీ

కర్లపాలెం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలో రొయ్యల చెరువులు సాగు చేస్తున్న విద్యుత్ వినియోగదారులు పలువురు విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. దీంతో విద్యుత్ విజిలెన్స్ ఈఈ మన్నెం భాస్కరరావు తమ సిబ్బందితో మండలంలోని తుమ్మలపల్లి, పెదపులుగువారిపాలెం తదితర గ్రామాలలో రొయ్యల సాగు చేస్తున్న విద్యుత్ కనెక్షన్లన్నిటిని మీటర్ రీడింగ్ తనిఖీ చేసే పరికరంతో బుధవారం తనిఖీలు చేశారు. మండలంలో రొయ్యల చెరువుల ద్వారా విద్యుత్ శాఖకు రావాల్సిన ఆదాయం కోట్లలో గండిపడిందని, అధికారులు అవినీతి ఊబిలో కూరుకుపోయారని మండల ప్రజానీకం తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఈ విషయంపై విజిలెన్స్ ఈఈ మన్నెం భాస్కరరావును వివరణ కోరగా రొయ్యలసాగు చేస్తున్న పలువురు రైతులు మీటర్ల సీల్ తీసి ఛాంబర్స్ కట్ చేసి అవినీతికి పాల్పడ్డారని, రెండు రోజుల్లో పూర్తి స్థాయిలో వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

బాపట్ల కాలేజి ఆఫ్ ఫార్మసీలో సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం

బాపట్ల రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల ఫార్మసీ కళాశాలలో రెడ్‌క్రాస్ బాపట్ల బ్రాంచ్, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ యూనిట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీఈజీకే మూర్తి బుధవారం తెలిపారు. సీపీఆర్ వారోత్సవాలలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించామని బాపట్ల జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ నారాయణ భట్టు తెలిపారు. గుండె ఆగిపోయే క్రమంలో గోల్డెన్ అవర్‌లో సీపీఆర్ ద్వారా వ్యక్తి ప్రాణాన్ని ఎలా కాపాడగలమో డాక్టర్ కీర్తి విద్యార్థులకు అవగాహన కలిగే విధంగా చూపించారు. ప్రస్తుతం చిన్న వయస్సులోనే గుండె జబ్బులు వస్తున్నాయని జీవనశైలితో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ పూర్ణచంద్రరావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దేశం గర్వించతగిన వ్యక్తి ఏపీజే అబ్దుల్ కలాం

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ



డాక్టర్ అబ్దుల్ కలాం విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ తదితర నాయకులు

బాపట్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : సామాన్య కుటుంబంలో పుట్టి శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా ఎదిగిన భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చిరస్మరణీయులని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. అబ్దుల్‌కలాం జయంతి కార్యక్రమాన్ని బుధవారం జీబీసీ రోడ్డులోని ఆయన విగ్రహం వద్ద నిర్వహించారు. పార్టీశ్రేణులతో కలిసి కలాం విగ్రహానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా కీర్తి గడించిన అబ్దుల్‌కలాం రాష్ట్రపతి పదవికే వన్నె తెచ్చారన్నారు. తన ప్రసంగాలతో యువతలో స్ఫూర్తిని నింపారన్నారు. అబ్దుల్‌కలాం జయంతిని ప్రపంచ విద్యార్థుల దినోత్సవంగా జరుపుకోవటం మనందరికి గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, నాటక అకాడమి కార్పొరేషన్ డైరెక్టర్ మందపాటి ఆంద్రేయ, సీనియర్ నాయకులు సాదు నాగేశ్వరరావు, మహిళా నాయకులు కాగిత నాగభూషణమ్మ, చెన్నుపాటి హైమావతి, కూచిపూడి ఝాన్సీరాణి, షేక్ నజ్మా, దాసరి నిర్మల, ఎస్సీ సెల్ నాయకుడు కూచిపూడి శ్యామ్‌సుందర్, అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఛైర్మన్ పఠాన్ రాజేష్, చేజర్ల సతీష్, ఏఎన్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.చార్వాక, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● మాజీ రాష్ట్రపతి, దివంగత ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా జీబీసీ రోడ్డులోని ఆయన విగ్రహానికి బీజేపీ నాయకులు బుధవారం ఘన నివాళులు అర్పించారు. పార్టీ శ్రేణులతో కలిసి పట్టణ పార్టీ అధ్యక్షుడు బ్రహ్మాండం బాలనారాయణ పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు మామిడి రమేష్‌కుమార్, సీనియర్ నాయకులు మువ్వల శ్రీనివాస్, పి.శ్రీనివాసరాజు, ఆవుల వెంకటేశ్వరరావు, శాస్త్రి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

● దేశాభివృద్ధిలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సేవలు మరువలేనివని మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు అన్నారు. అబ్దుల్ కలాం జయంతి కార్యక్రమాన్ని మున్సిపల్ కార్యాలయ సమీపంలో తవ్వకాల్వ వద్ద ఉన్న ఆయన విగ్రహం దగ్గర బుధవారం నిర్వహించారు. మాజీ సైనికులతో కలిసి ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతదేశ రక్షణ వ్యవస్థను బలపర్చటంలో ఆయన పాత్ర కీలకమైనదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనిక సంక్షేమ సంఘ నాయకులు పుట్టా ఆదిశేషారెడ్డి, సీహెచ్ వెంకటకృష్ణారావు, షేక్ మొయిమొద్దిన్, పీటా సారథి, సుంకర శేషగిరిరావు, డి.వెంకటేశ్వర్లు, రహమాన్, ఏడుకొండలు, రాధాకృష్ణమూర్తి, రక్ష్మధరావు, రాయపూడి శ్రీనివాసరావు, షేక్ ఖలీల్, పసుపులేటి ప్రసాద్, ఆవుల వెంకటేశ్వర్లు, పఠాన్ రాజేష్ పాల్గొన్నారు.

● మిస్సైల్ మ్యాన్‌గా ప్రఖ్యాతి నొందిన అబ్దుల్ కలాం అఖిల విశ్వానికి ఆదర్శమూర్తి అని, రాష్ట్రపతిగా దేశానికి ఆయన విశిష్టత సేవలందించారని సాహితి భారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ అన్నారు. బాపట్ల సాహితిభారతి ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం 94వ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాహితిభారతి కోశాధికారి ఆదంషఫీ, సాహితిభారతి ఉపాధ్యక్షులు మర్రి మాల్యాద్రిరావు, గ్రో సంస్థ అధినేత, రచయిత బందాబాబు, ప్రజాకవి డాక్టర్ శ్రీనివాస్, రావూరి నరసింహవర్మ, ఆదం షఫీ, మర్రి మాల్యాద్రిరావు, కామరాజు కాళీదాసు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, కస్తూరి శ్రీనివాసరావు, ఎం.జాకబ్ తదితరులు అబ్దుల్‌కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

● రేపల్లె, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : యువత భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకుని వారి ఆశయాలను కొనసాగించాలని టీడీపీ నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కొలసాని రాము అన్నారు. నిజాంపట్నం మండలం కూచినపూడిలో అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కేక్ కట్ చేసి మిఠాయిలను పంచారు. ఈ కార్యక్రమంలో నల్లపాటి యల్లయ్య, శ్రీనివాసరావు, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కూచినపూడిలో అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న తెలుగు యువత అధ్యక్షుడు కొలసాని రాము

● భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వంటి ఉన్నత వ్యక్తులను ఆదర్శంగా తీసుకుని జీవితంలో ముందుకు సాగాలని ఈద్గా అధ్యక్షుడు షేక్ జమీర్ అన్నారు. బుధవారం స్థానిక మసీద్ సెంటర్‌లో అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డొక్కు బుజ్జి, షేక్ మొహిద్దీన్, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

● కర్లపాలెం, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి) : భారతదేశంను శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అభివృద్ధి చేసిన మిస్సైల్ మాన్, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ అని ప్రముఖ సమాజ సేవకులు, కేర్ మినిస్ట్రీస్ అధినేత మోపర్తి జాన్ అన్నారు. ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పందరబోయిన సుబ్బారావు, మాజీ సర్పంచ్ కాసాని వరప్రసాద్, కర్లపాలెం ఉపసర్పంచ్ పఠాన్ అహ్మద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

● రక్షణ పరిశోధన రంగం అభివృద్ధికి మాజీ రాష్ట్రపతి, భారతరత్న అవార్డుగ్రహీత అబ్దుల్ కలాం పాత్ర ఎంతో ఉందని అబ్దుల్ కలాం ఫౌండేషన్ అధ్యక్షుడు, ఉపసర్పంచ్ పఠాన్ అహ్మద్ బాషా అన్నారు. కర్లపాలెం కలామ్ ఫౌండేషన్ కార్యాలయంలో బుధవారం అబ్దుల్ కలాం జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యులు బాషా, ఇబ్రహీం, రియాజ్, తాడికొండ వెంకట్, ఖాదర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలి

పిట్టలవానిపాలెం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలపరిధిలోని రెడ్డిపాలెం విజేత పబ్లిక్ స్కూల్‌లో చందోలు ఎస్ఐ ఎం.వెంకటశివకుమార్ ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులకు బుధవారం ఎవేర్‌నెస్ ప్రోగ్రామ్‌లో భాగంగా గుడ్‌టచ్ గురించి తెలియజేశారు. ఎస్ఐ వెంకటశివకుమార్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు వాడటం వల్ల వచ్చే దుష్పరిణామాలను వివరించారు. ఎవరైనా మత్తు పదార్థాలకు అలవాటు పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, పరిసరాలు పరిశుభ్రత పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజేత పబ్లిక్ స్కూల్ విద్యార్థినీ, విద్యార్థులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నూతన జీఎస్టీ ద్వారా రేట్లు తగ్గాయి : జేసీ

బాపట్ల,అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి) : నూతన జీఎస్టీ ద్వారా రేట్లు తగ్గాయని జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ తెలిపారు. పట్టణంలోని మహాత్మాగాంధీరోడ్డులో యూనియన్‌బ్యాంక్ దగ్గర బుధవారం షాపింగ్‌బజారు ఏర్పాటు చేసి ప్రజలకు సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ నూతన జీఎస్టీ వల్ల ట్రాక్టర్ కొనుగోలు చేసిన రైతుకు 63వేల రూపాయలు లాభం వచ్చిందన్నారు. ముఖ్యంగా ఎల్ఐసీ మీద జీరో జీఎస్టీ వచ్చింది కావున తప్పనిసరిగా ప్రతిఒక్కరు ఎల్ఐసీ చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కమర్షియల్ ట్యాక్ డిప్యూటీ కమిషనర్ మురళికృష్ణ, మెప్మాసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జీఎస్టీ అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ

ఇసుక తరలించిన వారిపై చర్యలు తీసుకోవాలి

బాపట్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం వెదుళ్ళపల్లి బధిరుల ఆశ్రమ పాఠశాల పక్కనే డ్రైనేజి కార్యాలయం ఎదురు పేరలి డ్రెయిన్ కట్ట ఇసుకను తవ్వి తరలించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆలిండియా బహుజన సమాజ్‌పార్టీ రాష్ట్ర కార్యదర్శి కాగిత కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆయన బుధవారం ఇసుక తవ్విన ప్రాంతాన్ని పరిశీలించి కేవలం డ్రైనేజి అధికారుల నిర్లక్ష్యం కారణంగానే జరుగుతుందన్నారు. 30 ట్రాక్టర్‌ల ఇసుకను తవ్వి తరలించారని దీనికి డ్రైనేజి అధికారులు నైతిక బాధ్యత వహించాలన్నారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని కోరారు.

వైద్య కళాశాలలను ప్రభుత్వమే నిర్మించాలి

బాపట్ల, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి) : వైద్య కళాశాలలను ప్రైవేట్ పరం చేస్తే పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్య అందేనా అని ప్రజా ఆరోగ్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రమణయ్య ప్రశ్నించారు. బుధవారం బాపట్ల మెడికల్ కళాశాల నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించిన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వమే మెడికల్ కళాశాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ కె.రఘుచంద్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ మజుందార్, కె.శరత్, వై.భాస్కరరావు, కె.నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

జూద స్థావరంపై పోలీసుల దాడి

కొల్లూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గాజుల్లంక గ్రామంలో ఒక గృహంపై ఎస్ఐ జానకి అమరవర్ధన్, పీఎస్ఐ శ్రీనివాస్, సిబ్బందితో దాడులు నిర్వహించి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.2,740 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జూదరులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.



ర్యాలీ నిర్వహిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ, డీఈవో ఎస్.పురుషోత్తం తదితర అధికారులు, ఉపాధ్యాయులు

మీ ఆరోగ్యం మీచేతుల్లోనే : డీఎంహెచ్‌వో

బాపట్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మీ ఆరోగ్యం మీచేతుల్లోనే ఉందని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ తెలిపారు. గ్లోబల్ హ్యాండ్ వాషింగ్‌డే పురస్కరించుకొని బుధవారం బాపట్ల మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. డీఈవో ఎస్.పురుషోత్తం, ఎంఈవోలు ఎస్.నిరంజన్, డి.ప్రసాదరావు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది కలిసి నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు భోజనం చేసే ముందు చేతులు కడుక్కోవాలన్నారు. అపరిశుభ్రమైన చేతులు ఆరోగ్యానికి హాని చేస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మండలపరిషత్ కార్యాలయ ఆవరణలో...

బాపట్ల,అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి) : మండలపరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం గ్లోబల్ హ్యాండ్‌వాష్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యాలయ సూపరింటెండెంట్ చక్రధర్ పాల్గొని ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండటానికి చేతులు శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. తినేముందు, తిన్నతర్వాత బయటకు వెళ్ళి వచ్చిన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎమ్ సురేష్, సీసీలు రత్నరాజు, సుమలత, సాంబిరెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

చినపరిమిలో...

చుండూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చేతుల పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ హెచ్ఈవో పోలే కోటేశ్వరరావు వివరించారు. ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా చినపరిమిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు చేతుల పరిశుభ్రత అవసరం గురించి వివరించారు. విద్యార్థులు, ఆహార పదార్థాలు తినే ముందు, మల, మూత్ర విసర్జన తరువాత సబ్బుతో చేతులు పరిశుభ్రంగా కడుగుకోవాలని తెలిపారు. ఏడు రకాలుగా చేతులు పరిశుభ్రం చేసుకుని విధానాలు చేసి చూపించారు. కార్యక్రమంలో మండల వైద్య సిబ్బంది పుష్పరత్నం, దాసరి మేరి, సుభాషిణి, శివపార్వతి, లక్ష్మీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో...

కొల్లూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : గ్లోబల్ హ్యాండ్ వాష్ డేను ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. బుధవారం డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏపీఎఫ్ గుడిమెట్ల శ్రీమన్నారాయణ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.వెంకటరమణ హాజరై హ్యాండ్‌వాష్ డే ఆవశ్యకతను మహిళలకు వివరించారు. ఏపీఎం ఏడు పద్ధతులను ఎలా అవలంబించాలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సీసీలు దాసరి హనోకు, పి.నరేంద్ర, రజనీకుమారి, బి.శిరీష, వీవోఏలు, వీవోలు, మహిళలు పాల్గొన్నారు.

వాహనపత్రాలు దగ్గర ఉంచుకోవాలి

బాపట్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : వాహన చోదకులు తప్పనిసరిగా వాహనపత్రాలు దగ్గర ఉంచుకోవాలని బాపట్ల మోటారు వాహనాల తనిఖీ అధికారి రంగారావు తెలిపారు. పట్టణంలో బుధవారం ఆయన వాహనాల తనిఖీలు విస్తృతంగా చేపట్టారు. ప్రయాణ సమయంలో తప్పక సీటు బెల్ట్ ధరించాలని చెప్పారు. అధికలోడ్‌తో ప్యాసింజర్లను వాహనాలలో ఎక్కించరాదన్నారు. తగిన జాగ్రత్తలు పాటిస్తూ ప్రమాదాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



వేమూరులో శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు

గ్రామాల పరిశుభ్రతకు కృషి చేయాలి : ఎంపీడీవో

వేమూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల పరిశుభ్రతకు సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు ప్రధాన భూమిక వహించాలని ఎంపీడీవో పి.రవికుమార్ అన్నారు. స్థానిక రోశయ్య మీటింగ్ హాలులో ప్రభుత్వ ఆదేశాల మేరకు క్లీన్ అండ్ గ్రీన్‌పై మూడు రోజుల శిక్షణలో భాగంగా బుధవారం మొదటిరోజు సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రవికుమార్ మాట్లాడుతూ, ప్రధానమైన నాలుగు అంశాలపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రతి గ్రామాన్ని పరిశుభ్రమైన పచ్చదనం కలిగిన గ్రామంగా తీర్చిదిద్దేందుకు కంకణబద్దులు కావాలన్నారు. ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కార్యక్రమాన్ని అమలు పరచాలన్నారు. గ్రామాల్లో స్వచ్ఛరథం ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. తద్వారా పనికిరాని ప్లాస్టిక్ ఇనుము, సీసాలు ఇతర సామగ్రిని స్వచ్ఛరథం సర్వీసు మ్యాన్‌కు అప్పగించి ఇతరమైన కొత్త వస్తువులు నిత్యవసర సరుకులు పొందే విధానానికి సహకరించాలన్నారు. గ్రామ పంచాయతీ ద్వారా కూడా పాత వస్తువులు సేకరించడం జరుగుతుందని, వాటి ద్వారా కిలోల లెక్కన డబ్బులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ట్రైనర్ సాదిక్ ఆలీ మాట్లాడుతూ, క్లాప్ మిత్రాల హక్కులు పరిరక్షణ విషయాలను వివరించారు. గ్రామాల పరిశుభ్రత కోసం పని చేసే వారిని గుర్తించి వారికి సంబంధించిన వస్తు సామగ్రిని సమకూర్చాలని తెలిపారు.

చెత్తసేకరణ సమర్థవంతంగా అమలు చేయాలి

నగరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పరిశుభ్రత కాపాడటానికి ప్రతి గ్రామంలో చెత్తసేకరణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని నగరం ఎంపీడీవో బొర్రా శ్రీనివాసరావు సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పరిశుద్ధ్యం సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని గ్రామ కార్యదర్శులను ఆదేశించారు. తడి, పొడి చెత్తను వేరుచేసి సక్రమంగా పారవేయాలని సూచించారు. తడిచెత్తను వర్మీకంపోస్టు తయారీకి ఉపయోగించి సేంద్రీయ ఎరువులు తయారుచేసుకోవచ్చని తెలిపారు. స్వచ్ఛతా కార్మికులకు జీతాలు సమయానికి అందించటంతో పాటు, వారికి అవసరమైన సేఫ్టీ కిట్లను అందిస్తామని ఎంపీడీవో బొర్రా శ్రీనివాసరావు హామీనిచ్చారు.



తడి, పొడి చెత్త సేకరణ, వర్మీ కంపోస్టు తయారీపై సూచనలు చేస్తున్న ఎంపీడీవో బొర్రా శ్రీనివాసరావు

గోళ్ల అనిల్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలి

● బాబు జగ్జీవన్‌రామ్ కమిటీ సభ్యులు డిమాండ్

కొల్లూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : విశ్రాంత ఐఏఎస్, ఎమ్మెల్యే రామాంజనేయులుపై అనుచితంగా ప్రవర్తించిన మాల మహానాడు అధ్యక్షుడు గోళ్ల అనీల్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని బాబుజగ్జీవన్‌రామ్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. కొల్లూరులో బుధవారం యూత్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, మాల మహానాడు అధ్యక్షుడిగా ఉండి తోటి దళిత ఎమ్మెల్యేను అగౌరవపరుస్తూ ఒక మనుసంస్కృతికి బాటలు వేస్తూ ఓ కార్యక్రమంలో దూషణ పర్వానికి దిగడం సమంజసం కాదని, ఆ భావ జాలం మానుకోవాలని హెచ్చరిస్తున్నామన్నారు. ఇలాంటి వారిపై చట్టపరంగా పోలీసు శాఖ చర్యలు తీసుకుని మరొకరు ఈ విధంగా ప్రవర్తించకుండా అదుపు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోరికపూడి ప్రసాద్, చొప్పర సంసోను, కొమ్మూరు రాములు, చొప్పర బిక్షాలు, చంటి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు అభినందనలు

కొల్లూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఎస్ఐ అమరవర్ధన్ బుధవారం అభినందించారు. కొల్లూరులోని ఫోర్ ఫ్రంట్ విద్యా సంస్థ విద్యార్థులు గరిక రిత్విక్, మునిపల్ పునీత్‌లు స్కేటింగ్ బాల్ జాతీయ పోటీలకు ఎంపికైనట్లు తెలుసుకున్న ఎస్ఐ విద్యార్థులను అభినందించారు. పిల్లల్లో క్రీడా స్ఫూర్తిని నింపి ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను దుశ్శాలువాలతో సత్కరించారు. గ్రామీణ ప్రాంతంలోని విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్లే జరుగుతుందన్నారు. క్రీడల వల్ల విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని, తల్లిదండ్రులు ఆ దిశగా ఆలోచించి తమ పిల్లలను ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యా సంస్థ ప్రిన్సిపల్ అనితకుమారిరాజన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎస్ఐ అమరవర్ధన్

దీపావళి దుకాణాలకు అనుమతి ఉండాలి : డీఎస్పీ



డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు

రేపల్లె, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అనుమతి తీసుకుని దీపావళి దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని డీఎస్పీ ఆవులశ్రీనివాసరావు అన్నారు. ఆయన బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అన్ని పట్టణ, గ్రామాలు, మండలాల్లో దీపావళి దుకాణాదారులు తప్పనిసరిగా పోలీస్, రెవెన్యూ, ఫైర్ సిబ్బంది నుంచి అనుమతి తీసుకుని దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.రూల్స్‌ను అతిక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని తెలిపారు. ప్రమాదాలకు తావులేకుండా ముందస్తుగా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు.

విద్యార్థులను మానసికంగా దృఢంగా తయారు చేయాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న వెంకటసుబ్బయ్య

చెరుకుపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : సమగ్రశిక్షా అభియాన్‌లో భాగంగా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కెరీయర్ అండ్ మెంటల్ హెల్త్ ప్రోగ్రామ్‌ను రాష్ట్ర పీఎంయూ కోఆర్డినేటర్ డీఆర్ వెంకటసుబ్బయ్య బుధవారం చెరుకుపల్లి, గుళ్ళపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలల్లో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మండల విద్యాశాఖాధికారులను కలిసి విద్యార్థులను మానసికంగా ఎలా దృఢంగా చేయాలనే విషయంపై చర్చించారు. ఎస్ఐ టి.అనిల్ కుమార్ విద్యార్థులకు సైబర్ క్రైమ్, డ్రగ్స్, ఈవ్‌టీజింగ్, రోడ్డు ప్రమాదాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు లాజరు, నవీన్‌కుమార్, చెరుకుపల్లి జడ్పీహైస్కూల్ హెచ్‌ఎం కాటూరి లక్ష్మీనారాయణ, గుళ్ళపల్లి జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కవిత, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవీ.. ఇవీ


కోటపాడు మైనర్‌లో తూములు మూసుకుపోయి కట్టలుపొర్లి పొలాల్లో ప్రవహిస్తున్న సాగర్‌జలాలు

మూసుకుపోయిన తూములు

● పంట పొలాలను ముంచెత్తుతున్న సాగర్‌జలాలు

పంగులూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి):పమిడిపాడు మేజర్ పరిధిలోని కోటపాడు మైనర్‌లో డ్రాపువద్ద తూములు మూసుకుపోయి సాగర్ జలాలు పంటపొలాలను ముంచెత్తుతున్నాయి. దీంతో పంటలు వేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని కొండమంజులూరు, కోటపాడు గ్రామాల మధ్య కోటపాడు మైనర్‌లో డ్రాపువద్ద తూములు పూర్తిగా మూసుకుపోయాయి. కాలువలో వచ్చే సాగర్ జలాలు ముందుకు పోయే వీలులేక కట్టలుపొర్లి పొలాలను ముంచెత్తడంతో సాగుపనులు నిలిచిపోయాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు.గత కొద్ది రోజులుగా నెలకొన్న ఈ పరిస్థితిని అధికారులు దృష్టికి తీసుకెళ్లినా సమస్యను పరిష్కరించలేదని కోటపాడు, కొండమంజులూరు గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు. వరినాట్లు వేసుకునే సమయంలో తమ పొలాలు సాగర్‌జలాలతో వరదను తలపిస్తున్నాయని,వ్యవసాయ పనులు నిలిచిపోయి ఇబ్బంది పడుతున్నామని రైతులు వాపోతున్నారు. సమస్యను తక్షణమే పరిష్కరించాలని మైనర్ పరిధిలోని రైతులు సాగర్ అధికారులను కోరుతున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో వరూధిని

ఈకేవైసీ త్వరితగతిన పూర్తి చేయాలి

అద్దంకిటౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద పనులకు వచ్చే జాబ్ కార్డుదారులకు ఈకేవైసీ త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో బి. వరూధిని సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలోని ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టీఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఇప్పటి వరకు ఉన్న ఉపాధి హామీ పథకం జాబ్ కార్డుదారులు, పూర్తి చేసిన ఈకేవైసీ, చేయాల్సిన విషయాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మండలంలో మొత్తం జాబ్ కార్డుదారులు 20,188 మంది ఉండగా వారిలో 12,800 ఈకేవైసీ పూర్తి చేయడం జరిగిందని ఏపీవో నాగ శివకోటేశ్వరి ఎంపీడీవోకు తెలియజేశారు. మండలంలోని గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న మినీ గోకులం షెడ్‌లు పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. నిర్మాణాలు ప్రారంభించిన వాటిని వెంటనే పూర్తి చేసుకునేలా చూడాలన్నారు. హౌసింగ్‌కు సంబంధించి 90 రోజుల పనిదినాలపై ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఈసీ నాగరాజు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

చెన్నకేశవుని అభిషేకించిన భానుడి కిరణాలు

పంగులూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి):మండలంలోని చందలూరు గ్రామంలో శ్రీభూనీళాసమేత చెన్నకేశవస్వామి ఆలయంలో స్వామివారిని భానుడి కిరణాలు అభిషేకించాయి. బుధవారం ఉదయం 6గంటల 20 నిమిషాల నుంచి 6.30 నిమిషాల వరకు జరిగిన ఈ అపూర్వ ఘటనను పలువురు భక్తులు తిలకించారు. సౌరమానంను అనుసరించి ప్రతి సంవత్సరం ఉత్తరాయణం, కుంభ సంక్రమణం శతభిషం కార్తెలో ఫిబ్రవరి 27,28 తేదీలలో ఉదయం 6గంటల 30 నిమిషాల నుంచి 6గంటల 50 నిముషాల వరకు, దక్షిణాయణం కన్యా సంక్రమణ, చిత్తకార్తెలో అక్టోబరు 14,15తేదీలలో ఉదయం 6గంటల 10 నిముషాల నుంచి 6గంటల 30 నిముషాల వరకు స్వామివారిని ఆపాదమస్తకం సూర్యకిరణాలు అభిషేకిస్తాయని అర్చకస్వామి రఘునాధాచార్యులు తెలిపారు.


చందలూరులో శ్రీచెన్నకేశవస్వామి ఆలయంలో మూలవిరాట్‌ను అభిషేకిస్తున్న సూర్యకిరణాలు

రోడ్డు నిర్మాణ పనుల్లో జాప్యం

● అవస్థలు పడుతున్న ప్రజలు

అద్దంకి,అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): రోడ్డు పునర్‌నిర్మాణ పనులు నిదానంగా జరుగుతుండటంతో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని శాంతినగర్ నుంచి మైలవరం వరకు సుమారు 10 కి.మీ రోడ్డు ను రెండు దశాబ్దాల క్రితం నిర్మించగా పూర్తిగా గోతుల మయంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తరువాత మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక దృష్టి సారించి 5.10 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించారు. రెండు నెలల క్రితం రోడ్డు నిర్మాణ పనులు కూడా ప్రారంభమయ్యాయి. రోడ్డు వెడల్పు విస్తరించాల్సి ఉండటంతో రెండు వైపులా మార్జిన్‌లు తవ్వి గ్రావెల్ పోశారు. దీంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు మార్జిన్‌లో పోసిన గ్రావెల్ మొత్తం రోడ్డు మీదకు చేరి బురదమయంగా మారింది. దీంతో ద్విచక్ర వాహనచోదకులు జారుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు నిర్మాణ పనులు వేగవంతంగా జరిగి ఉంటే ఇప్పటికే మెటల్ పరిచి ఉంటే రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఉండేదని, అలా కాకుండా పనులు నిదానంగా జరుగుతుండటంతో ఇబ్బందులు పడాల్సి వస్తుందని వెంపరాల, ఉప్పలపాడు, మైలవరం, ఏలేశ్వరవారిపాలెం గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా పనులు వేగవంతంగా జరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


పొలాలకు వెళ్లే రోడ్డులా మారిన శాంతినగర్-మైలవరం రోడ్డు

కర్నూలుకు బస్సులు

గ్రామీణ రూట్లలో సర్వీసుల రద్దుతో ప్రయాణికుల ఇక్కట్లు

అద్దంకి,అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పర్యటన నేపథ్యంలో అద్దంకి డిపో నుంచి 27 బస్సులను పంపారు. మొత్తం 69 బస్సులు ఉండగా అందులో 27 బస్సులు కర్నూలుకు పోవడంతో పలు గ్రామీణ రూట్లలో బుధవారం బస్సులు రద్దు అయ్యాయి. నర్సరావుపేట, ఒంగోలు, వినుకొండ తదితర ప్రధాన రూట్లలో కొంతమేర బస్ సర్వీసులు నడపగా గ్రామీణ ప్రాంతాల సర్వీసులు రద్దు చేయటంతో ప్రయాణికులు ఎక్కువ సమయం వేచి ఉండాల్సి రావటంతో పాటు గమ్యస్థానాలకు చేరటానికి ఆటోలను ఆశ్రయించక తప్పలేదు. గురువారం కూడా ఇదే పరిస్థితి కొనసాగనుంది. శుక్రవారం ఉదయం నుంచి యథావిధిగా అన్ని రూట్లలో బస్సులు నడవనున్నాయి.



అద్దంకి ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

మండల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలి

చినగంజాం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : మండల సర్వతోముఖాభివృద్ధికి సభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఇన్‌చార్జి మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు తుమ్మలపెంట ప్రసన్నలక్ష్మి అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్‌లో ఇన్‌చార్జి ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. మండలంలో పర్యాటక రంగం అభివృద్ధికి కృషి చేస్తామని ఎంపీడీవో కె.ధనలక్ష్మి అన్నారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కుకింగ్ ఏజెన్సీ వారు మధ్యాహ్న భోజనాన్ని సరిగా వండకపోవడంతో విద్యార్థులు భోజనం తినలేక మధ్యలోనే వదిలేస్తున్నారని ఆ గ్రామ సర్పంచ్ గొల్లమూరి శివకుమారి ఎంఈవో-2 కోటేశ్వరరావు దృష్టికి తెచ్చారు. పాఠశాలలోని మధ్యాహ్నభోజనాన్ని పరిశీలిస్తామని ఎంఈవో, ఎంపీడీవో తెలిపారు. కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని మూలగానివారిపాలెం గ్రామంలో శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని, ప్రమాదాలు జరగకముందే పాఠశాల భవనాన్ని తొలగించాలని, అలాగే ఓ ప్రైవేట్ పాఠశాలకు అనుమతులు ఇవ్వడంపై కొత్తపాలెం సర్పంచ్ ఆసోది బ్రహ్మారెడ్డి ప్రశ్నించారు. ఇళ్ల పట్టాలకు అర్హత కలిగిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ జీవి గుంట ప్రభాకరరావు తెలిపారు. మండల స్థాయి అధికారులు తమ శాఖల ప్రగతిని సభలో చదివి వినిపించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.


మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రసన్నలక్ష్మి

ఎవరినడిగి... 'సీమౌత్' పూడ్చారు !

(5వ పేజీ తరువాయి)

తెచ్చే ప్రక్రియలో భాగంగా ఈపూరుపాలెం స్ట్రెయిట్‌కట్ డ్రెయిన్ సముద్రంలో కలిసే ప్రాంతంలో మంగళవారం రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టారు. డ్రైనేజీ విస్తీర్ణం ఎంత అనే అంశంతో పాటు పట్టా, డీకే భూముల వివరాలు హద్దులతో సహా సర్వే చేసి నివేదికలో పొందుపరిచారు. ఈ వివరాలతో పాటు గతంలో జరిగిన ఘటనల సమగ్ర వివరాలతో రిపోర్టును శుక్రవారం కలెక్టర్ వినోద్‌కుమార్‌కు అందించడానికి కమిటీ సిద్ధమవుతోంది

నిబంధనలపై ముమ్మర కసరత్తు...

తీర ప్రాంత భూముల విషయంలో అవలంభించాల్సిన నిబంధనలపై రెవెన్యూ యంత్రాంగం ముమ్మర కసరత్తు చేస్తోంది. దానిలో భాగంగా గతంలో జరిగిన కొన్ని కేస్ స్టడీస్‌ను కూడా పరిశీలన చేస్తున్నారు. తీర ప్రాంత భూములపై యాజమాన్య హక్కు కలిగి ఉన్నప్పటికీ, సదరు విభాగాల అనుమతి లేకుండా ప్రవాహం దిశ మార్చడం నిబంధనల ఉల్లంఘన కిందకే వస్తుందనే ప్రాథమిక అంచనాకు సదరు విభాగాలు వచ్చినట్లు తెలుస్తోంది. స్టేట్‌మెంట్ రికార్డు సమయంలో రియల్టర్ బుర్ల వెంకట్రావును ఇదే విషయంపై వివరణ అడిగినట్లు తెలుస్తోంది. ఇదే కాకుండా సీమౌత్ వివాదంలో కొంత అసైన్డ్ భూమి భాగమై ఉండడం ఒక ఎత్తయితే పట్టా భూమి రికార్డుల విషయంలో కూడా అనేక సందేహాలను కమిటీ ఇవ్వబోతున్న నివేదికలో పొందుపరిచినట్లు తెలుస్తోంది

వివాదానికి ముగింపు పలకాల్సిందే...

దాదాపు మూడు నెలలుగా ఈపురుపాలెం స్ట్రెయిట్‌కట్ విషయంలో మత్స్యకారులు వివిధ రూపాలలో ఆందోళనలు చేస్తున్న సంగతి తెలిసిందే. పలుమార్లు ధర్నాలు, కలెక్టరేట్ ముట్టడిలాంటి కార్యక్రమాలతో ఉద్రిక్త వాతావరణం కూడా కొన్ని సందర్భాల్లో ఏర్పడుతోంది. ఈ వివాదానికి ఎట్టి పరిస్థితుల్లో మరో వారం రోజుల్లో ముగింపు పలకాల్సిందేనని కలెక్టర్ వినోద్‌కుమార్ పట్టుదలతో ఉన్నట్లు తెలుస్తోంది. దీనిలో భాగంగానే కమిటీ ఇచ్చే నివేదికతో పాటు వివిధ మార్గాలలో ఆ వివాదంపై సమాచారం తెప్పించుకునే పనిలో నిమగ్నమయ్యారు.

శివ నాగేశ్వరరావు మృతికి ఏలూరి సంతాపం

మార్టూరు,అక్టోబరు15(ఆంధ్రజ్యోతి):మండలంలోని చిమ్మిరిబండ గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, విజయ డెయిరీ పాల ఉత్పత్తిదారుల సంఘం మాజీ అధ్యక్షుడు శివ నాగేశ్వరరావు అనారోగ్య కారణంతో మంగళవారం మృతి చెందాడు. ఆయన మృతి పట్ల ఎమ్మెల్యే ఏలూరి సాంబ శివరావు బుధవారం ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన కుటుంబసభ్యులకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందన్నారు.

బాధిత కుటుంబాలకు టీడీపీ ఆర్థిక సహాయం

చీరాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : బాధిత కుటుంబాలకు టీడీపీ కూటమి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని యువనాయకులు గౌరీ అమర్నాథ్ పేర్కొన్నారు. వడ్డెసంఘంకు చెందిన ఇరువురు విద్యార్థులు ఇటీవల తీరంలో మృత్యువాత పడిన సంఘటన పాఠకులకు విదితమే. ఈక్రమంలో టీడీపీ యువనాయకులు గౌరీ అమర్నాథ్ బుధవారం ఆయా కుటుంబాలను పరామర్శించి చెరో రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ ఘటనపై విచారం వ్యక్తం చేశారు. ఆయన వెంట పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఉపసంహరించుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరణ చేయడం అవివేకమని, వెంటనే ఆలోచన వెనక్కు తీసుకోవాలని మాజీ ఎంఎల్‌సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. బుధవారం స్థానిక బాపనమ్మ కల్యాణ మండపంలో జేవీవీ, జీపీవీ, యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ, సీఐటీయూ సంయుక్త ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు.

పారిశుధ్య పనుల మెరుగునకు చర్యలు

అద్దంకి,అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య పనులు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ చిన్ని లక్ష్మీశ్రీనివాసరావు అన్నారు. అద్దంకి పట్టణంలోని వేలమూరిపాడు రోడ్డులో ఉన్న ఎన్‌టీఆర్ నగర్(జగనన్న కాలనీ)లో బుధవారం ఆయన పారిశుధ్యాన్ని పరిశీలించారు. కాలనీ సమీపంలో రోడ్డు మార్జిన్‌లో వ్యర్థాలు పోసి ఉండటాన్ని గమనించారు. డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కోరారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ బలరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు నమ్మవద్దు

అద్దంకి, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యంపై ప్రజలు అసత్య ప్రచారాలు నమ్మవద్దని అద్దంకి ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌చార్జి సీఐ హర్షవర్ధన్ రెడ్డి తెలిపారు. అద్దంకి సర్కిల్ పరిధిలో 24 మద్యం షాపులు, ఒక బార్ ఉన్నాయని, ఇప్పటి వరకు ఎలాంటి నకిలీ మద్యం పట్టుబడలేదని అన్నారు. బెల్ట్‌షాపులకు మద్యం అమ్మకాలు చేయరాదన్నారు. అనధికారికంగా మద్యం అమ్మకాలు జరిగితే 6281288914, 9440902497 సెల్ నెంబర్‌లకు తెలియజేయాలన్నారు.

ఏబీసీలో బయటపడిన మహిళ మృతదేహం

బల్లికురవ, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని వైదన గ్రామ సమీపంలో అద్దంకి బ్రాంచ్ కాలువలో మంగళవారం రాత్రి బయటపడిన మహిళ మృతదేహానికి సంబంధించి కేసు నమోదు చేశామని ఎస్ఐ వై. నాగరాజు తెలిపారు. పల్నాడు జిల్లా వినుకొండ మండలం పిట్టంబండ గ్రామానికి చెందిన కర్రి పార్వతి(45)గా గుర్తించినట్లు తెలిపారు. మృతురాలి భర్త నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని వారికి అప్పగించామని ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

మార్టూరు,అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): బైక్‌ను గేదెలు ఢీకొని రోడ్డుపై పడిపోయి తీవ్రంగా గాయపడి ఐదు రోజులుగా గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇస్తర్ల మరియమ్మ (70) అనే వృద్ధురాలు మంగళవారం రాత్రి మృతిచెందినట్లు ఏఎస్ఐ బాషా బుధవారం తెలిపారు. ఆమె కుమారుడు చినదాసు ఫిర్యాదు మేరకు బుధవారం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టు మార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ బాషా తెలిపారు.

ఒడిశా వాసి ఆత్మహత్య

మార్టూరు,అక్టోబరు15(ఆంధ్రజ్యోతి):మండల పరిధిని జొన్నతాళి సెంటరులో కిళ్లీ బంకు నడుపుతున్న ఒడిశాకు చెందిన శ్రీధర్ దల్ (58) అనే వ్యక్తి గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు కండువాతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన బుధవారం ఉదయం జరిగింది. ఆర్థికంగా అప్పులు ఉండటం, ఒంటరితనానికి గురికావడంతో తీవ్ర మానసిక వ్యథకు గురై ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. మృతుని కుమారుడు ప్రదీప్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరరావు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చినగంజాం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : చినగంజాం సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ విద్యుత్ లైన్‌ల మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఇన్‌చార్జి అసిస్టెంట్ ఇంజనీర్ ఎల్. బ్రహ్మం బుధవారం తెలిపారు. సోపిరాల, పూలవారిపాలెం, మున్నంవారిపాలెం, ఇండస్ట్రియల్-1 ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

బైక్ నుంచి పడి మహిళకు తీవ్రగాయాలు

మార్టూరు, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): టీవీఎస్ వాహనంపై వెళుతున్న జెపంగులూరు మండలం రామకూరు గ్రామానికి చెందిన రాజ్యలక్ష్మిఅనే మహిళ పడిపోవడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం మార్టూరు సెంటరు సమీపంలో ఒంగోలు వైపు వెళ్లే హైవేపై జరిగింది. ఆమె టీవీఎస్ వాహనంపై వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు 108 కిసమాచారం ఇవ్వడంతో ఆస్పత్రికి తరలించారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

చినగంజాం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలకు విద్యార్థులు ఎంపికైనట్లు చినగంజాం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం జరిగిన అభినందనసభలో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం, ఉపాధ్యాయులు, పీడీలు అభినందించారు. కబడ్డీ అండర్-17 విభాగంలో హర్ష, వంశీకర్, కబడ్డీ అండర్-14 విభాగంలో వేణు, అజయ్, మణికంఠరెడ్డి, కారాని సాయి, వాలీబాల్‌లో గోపిచంద్, ఉస్మాన్‌లు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

క్రీడాపోటీల్లో చందలూరు విద్యార్థుల ప్రతిభ

పంగులూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): డివిజన్‌స్థాయి క్రీడా,ఆటల పోటీలలో చందలూరు ఉన్న త పాఠశాల విద్యార్థులు సత్తాచాటి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్ -17 కబడ్డీలో బి.సాయిసందీప్, వాలీబాల్‌లో కె.ఈశ్వర్ , 1500, 3వేల మీటర్ల పరుగు పందెం లో ఎం.విష్ణువర్ధన్‌రెడ్డి, యోగా పోటీలలో అండర్-17లో నాయపాము శృతి, భవ్య, అండర్-14లో కె.హెప్సిబా ప్రతిభచూపి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయినట్లు పాఠశాల పీడీ .ప్రతిమ,మధుమూర్తి తెలిపారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

కొత్తపేట(చీరాల), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : తీరంలో వేటపాలెం మండలం కొత్తపేట పంచాయతీ వడ్డెసంఘంకు చెందిన ఇరువురు విద్యార్థుల మృతి తనను కలచి వేసిందని మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. ఇటీవల కుమారులను కోల్పోయి శోకసంద్రంలో ఉన్న రెండు కుటుంబాల సభ్యులను మంగళవారం రాత్రి పరామర్శించారు.

'వచ్చే ఎన్నికల్లో వైసీపీ నుంచే పోటీచేస్తా'

రామకృష్ణాపురం(చీరాల), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ నుంచే పోటీచేస్తానని, ఇందులో ఏమార్పు ఉండదని నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ స్పష్టం చేశారు. బుధవారం ఆ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రామకృష్ణాపురం క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కళాశాలల పట్ల అవలంబిస్తున్న తీరుపై విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు.

న్యాయం చేయాలని హోంగార్డు ఇంటిముందు భార్య బైఠాయింపు

బోయినవారిపాలెం(చీరాల), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : తనకు న్యాయం చేయాలని హోం గార్డు ఇంటి ముందు భార్య బైఠాయించింది. మండల పరిధిలోని బోయినవారిపాలెంకు చెందిన బోయిన చంద్రశేఖర్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో హోం గార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. ఇతనికి గతకొన్ని సంవత్సరాల క్రితం వేటపాలెం మండలం బచ్చులవారిపాలెంకు చెందిన సుగుణతో వివాహం జరిగింది. ఆతరువాత వారిమధ్య విభేదాలు చెలరేగాయి. ప్రస్తుతం వ్యవహారం కోర్టులోఉంది. ఇదిలా ఉండగా బుధవారం ఆమె భర్త ఇంటిముందు బైఠాయించి నిరసన తెలిపింది.

నిషేధమా అదెక్కడ..?

(5వ పేజీ తరువాయి)

పూర్తిగా విఫలమవుతోంది. నిషేధం ప్రచారానికే పరిమితమవుతోంది. యథేచ్ఛగా నిషేధిత ప్లాస్టిక్ వినియోగం, విక్రయాలు సాగుతున్నా... చర్యలు తీసుకోవాల్సిన యంత్రాంగం చోద్యం చూస్తోంది.

● పర్యావరణంపై తీవ్ర ప్రభావం

పర్యావరణం పై ప్లాస్టిక్ వ్యర్థాలు తీవ్ర ప్రభావం చూపుతాయి. కాలువల్లో పూడిక తీసే సమయంలో పెద్ద ఎత్తున ప్లాస్టిక్ కవర్లు, సీసాలు, గ్లాసులు ఉంటున్నాయి. ఈ కవర్ల వినియోగంపై నియంత్రణ కనిపించటం లేదు. విందు, వినోదాలలో కూడా ప్లాస్టిక్ గ్లాసులు, పేపర్ సామగ్రిని వినియోగిస్తున్నారు. చివరకు కూరలు, అహారం ప్యాకింగ్‌లో కూడా ప్లాస్టిక్ పేపర్, కవర్లను వాడుతున్నారు. వేడి అహార పదార్థాలను ప్లాస్టిక్ కవర్లలో ప్యాకింగ్ చేయడం వల్ల అవి కరిగి అహారంలో కలసిపోతూ ప్రాణ సంకటంగా మరుతున్నాయి. అలాగే పట్టణాలలో ఏ మురుగు కాలువ చూసినా ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు కన్పిస్తున్నాయి. మురుగు కాలువలు పూడి పోవటానికి ప్లాస్టిక్ ఒక కారణంగా ఉంది. పట్టణాలలో ప్రతిరోజు ఉత్పత్తి అయ్యే వ్యర్థాలలో నాలుగో వంతు ప్లాస్టిక్ వ్యర్థాలు ఉంటున్నాయి.

సీల్డ్ టెండర్ కమ్ బహిరంగ వేలం ప్రకటన

గ్రామ పంచాయతీ, వైదన, బల్లికురవ మండలం

తేది :14-10-2025

బాపట్ల జిల్లా, బల్లికురవ మండలం, వైదన గ్రామ పంచాయతీ చేపల చెరువులో చేప పిల్లలు వేసి పెంచి పట్టుకొనుటకు

సీల్డ్ టెండర్ కమ్ బహిరంగ వేలం నిర్వహించుట గురించి.

వైదన గ్రామ పంచాయతీలో పంచాయతీ పెద్దచెరువు, చిన్నచెరువులలో చేప పిల్లలు వేసి పెంచి పట్టుకొనుటకు హక్కు **1435, 1436 ఫసలిలకు అనగా 2025-26, మరియు 2026-27** అనగా రెండు సంవత్సరాలకు కలిపి సీల్డ్ టెండర్ కమ్ బహిరంగ వేలం వేయటకు **తేది.24-10-2025న** గ్రామ పంచాయతీ కార్యాలయము నందు **ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు** సీల్డ్ టెండర్ నిర్వహించబడి అదే రోజు **మధ్యాహ్నం 3:00 గంటలకు** శ్రీయుత జిల్లా పంచాయతీ అధికారి లేక వారి అనుమతి పొందిన వారి సమక్షంలో వేలం నిర్వహించబడును. రూ.8,00,000/- ధరావత్తు చెల్లించి సీల్డ్ టెండర్ కమ్ బహిరంగ వేలం పాటలో పాల్గొనవలయును వివరములకు గ్రామ పంచాయతీ కార్యాలయములో ఆఫీసు పనిచేయు వేళల యందు సంప్రదించగలరు. పాట వాయిదా వేయుటకు గ్రామ పంచాయతీకి అధికారము కలదు.

బి.ప్రసాదరావు, పంచాయతీ కార్యదర్శి,
వైదన, బల్లికురవ మండలం, బాపట్ల జిల్లా